క్లుప్తంగా

మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో గుర్రం గౌతమ్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గుర్రం గౌతమ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘంలో కేక్ కట్ చేసి చిన్నారులకు అవసరమైన పుస్తకాలు, పెన్నులు, తదితర విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో సీరపు గణేష్‌రెడ్డి, రేగుళ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

స్టిక్ మనోహర్‌కు జాతీయ పురస్కారం



జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న స్టిక్ మనోహర్

సీటీఆర్ఐ: హైదరాబాద్ నాంపల్లి ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్, హైదరాబాద్ ఆధ్వర్యంలో డాక్టర్ బీవీ పట్టాభిరామ్ మెమోరియల్ ఫస్ట్ నేషనల్ అవార్డు– 2025 కార్యక్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన మెజీషియన్ డాక్టర్ ఎస్.మనోహరరావు (స్టిక్ మనోహర్‌కు బెస్ట్ సైకలాజికల్ మెజీషియన్ అవార్డు అందించారు. ఈ పురస్కారాన్ని ముఖ్య అతిథి, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ అందజేశారు. ఆ వివరాలను గురువారం ఆయన తెలిపారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కడియం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తామని ఎంపీడీఓ కె.రమేష్ తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. ఆయా శాఖల అధికారులు, ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

నిరక్షరాస్యత నిర్మూలనకు తోడ్పడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్

కడియం: వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కోరారు. ఈ మేరకు కడియంలో మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అధ్యక్షతన వహించిన ఎంపీపీ మాట్లాడుతూ చదువు ప్రాధాన్యాన్ని ప్రతి ఒక్కరికి వివరించి, అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. వయోజన విద్యాశాఖ జిల్లా అధికారి వెంకటరెడ్డి, ఎంపీడీఓ కె.రమేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఎ.అన్నపూర్ణ, ఏపీఎం ఎ.నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా విష్ణు సహస్రనామ పారాయణ



శ్రీసత్యసాయి మందిరంలో విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న దృశ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీసత్యసాయి మందిరంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి గురుకులం కరస్పాండెంట్ శ్యాంసుందర్ మాట్లాడుతూ భగవాన్ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సత్యసాయి మందిర్, శంభూనగర్, టి.నగర్‌లకు చెందిన కన్వీనర్లు, శ్రీసత్యసాయి గురుకుల ఉపాధ్యాయ బృందం, 180 మంది భక్తులు పాల్గొన్నారు.

ఊగుతూ.. తూగుతూ..

- రాత్రయితే పేట్రేగిపోతున్న అరాచక మూకలు
- సీరియస్‌గా తీసుకున్న పోలీసులు



నగరంలో రాత్రి సమయంలో వెళ్తున్న యువకులను ప్రశ్నిస్తున్న పోలీసు

కంబాలచెరువు: మందేసి చిందేస్తున్నారు.. గంజాయితో ఎంజాయ్ చేస్తున్నారు.. అరాచక శక్తులు పేట్రేగిపోతున్నారు.. చారిత్రక రాజధానిగా పేరొందిన, జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలో గంజాయి బ్యాచ్‌లు పెరిగిపోయాయి. అర్ధరాత్రి రోడ్లపై తిరుగుతూ జనాన్ని ఇబ్బందులు పెడుతున్నాయి.. నగరంలో గస్తీ కాస్తున్న పోలీసులనే ముప్పుతిప్పలు పెడుతున్నాయి. వీరి నుంచి సాధారణ ప్రజానీకం ఇంకెన్ని ఇబ్బందులకు గురవుతున్నారో చెప్పనవసరం లేదు. ఈ నెల 8న అర్ధరాత్రి రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ వద్ద చోటుచేసుకున్న సంఘటనే ఉదాహరణ. డ్యూటీలో ఉన్న పోలీసులు నాగరాజు, కాశీలపై మద్యం తాగిన ముగ్గురు యువకులు దాడి చేసిన సంగతి తెలిసిందే. దీంతో పోలీసు శాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడి, కారణాలను అన్వేషించింది. రాత్రుళ్లు గస్తీ పెంచితేనే అరాచక మూకల ఆట కట్టించవచ్చని పోలీసులు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు.

రాత్రిళ్లు... వ్యాపారాలు

నగరంలో రాత్రి 10 గంటలు దాటిందంటే కుయ్ కుయ్‌మంటూ పోలీస్ సైరన్‌తో పెట్రోలింగ్ జీప్ వస్తోంది. సమయం అయిపోయిందంటూ జీప్‌లో ఉన్న పోలీసులు దుకాణాలు మూసివేయాలంటూ సైరన్ ఇచ్చి వెళ్లిపోతుంటారు. దాదాపు 70 శాతం మంది పోలీసు సైరన్ వినిపించే సరికే దుకాణంలో ఎంతమంది వినియోగదారులున్నా లైట్లు ఆపి, షాపు షట్టర్ దించేస్తుంటారు. వినియోగదారులను పంపేసి దుకాణానికి తాళాలు వేసుకుని వెళ్లిపోతుంటారు. అయితే 25 శాతం దుకాణదారులు పోలీసులు జీప్ వచ్చి సైరన్ మోగినప్పుడు లైట్లు ఆపి, షట్టర్ సగం దింపి, ఆ జీప్ కొంతదూరం వెళ్లిపోయాక లైట్లు వేసి యథావిధిగా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వీరు కూడా దాదాపు రాత్రి 11 గంటలు అయ్యేసరికి దుకాణాలు మూసేస్తారు. అయితే మిగిలిన 5 శాతం దుకాణదారులు ఎవరొస్తే మాంకేటి అన్నట్లు అర్ధరాత్రి సమయాల్లో వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

మందుబాబులకు అడ్డాగా..

కొంతమంది దుకాణదారులు రాజకీయ, ఇతర సాకులు చూపుతూ సమయం దాటినా యథేచ్ఛగా వ్యాపార కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. రాత్రి 10.30 తర్వాత దుకాణాలన్నీ మూసివేయాలి. కొందరు 11 గంటలు దాటిన తర్వాత ప్రధాన షట్టర్ మూసివేసి వెనుక వైపు ఉన్న తలుపు తెరిచి అర్ధరాత్రి వరకూ వ్యాపారం కొనసాగిస్తున్నారు. 8న కోటిపల్లి బస్టాండ్ వద్ద నున్న జ్యూస్ సెంటర్ వద్ద ఈ కారణంగానే రౌడీ మూకలు పోలీసులపై దాడి చేయడానికి కారణమైందని చెబుతున్నారు. రాత్రిళ్లు తెరిచిన ఉంచిన దుకాణాల వద్దకు మందుబాబులు చేసి అల్లరి సృష్టిస్తున్నారు. గంజాయి వ్యాపారం కూడా నగరంలో ఎక్కువైంది. ప్రధానంగా స్థానిక మున్సిపల్ స్టేడియం, కోటిపల్లి బస్టాండ్, కోటిలింగాల రేవు, ధవళేశ్వరం ఏటిగట్టు రోడ్డు, ఆవ రోడ్డు, తూర్పు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో మందు, గంజాయి తాగుతున్న వారు అధికంగా కనిపిస్తున్నారు.

> **నగరంలో గస్తీ పెంచాం**
>
> 
>
> ఇటీవల నగరంలో చోటుచేసుకున్న సంఘటనల నేపథ్యంతో రాత్రి గస్తీ ముమ్మరం చేశాం. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారు ఎంతటి వారినైనా ఉపేక్షించ వద్దని పోలీసులకు ఆదేశాలు ఇచ్చాం. ఇందులో భాగంగా గస్తీ ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల్లో 11 వందల వాహనాలను తనిఖీ చేసి 90 కేసులు నమోదు చేశాం. 23 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగంగా మద్యం తాగుతున్న 110 మందిపై కేసులు పెట్టాం.
>
> –డి.నరసింహకిశోర్, జిల్లా ఎస్పీ

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద తమ డిమాండ్ నోటీసులను చూపిస్తున్న సచివాలయ ఉద్యోగులు

సీటీఆర్ఐ: సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని ఉమ్మడి జిల్లా ఫెడరేషన్ కోఆర్డినేటర్ దడాల జగ్గారావు అన్నారు. గురువారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏపీ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్‌కు ఆందోళన కార్యక్రమాల ముందుస్తు సమాచారం అందించారు. ఈ సందర్భంగా జగ్గారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 1.25 లక్షల మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇంటింటికీ తిరిగి వలంటీర్ల విధులు నిర్వహించడం వల్ల క్షేత్ర స్థాయిలో తీవ్ర అవమానాలకు గురవుతున్నామన్నారు. ఇది ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలుగుతుందన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, ఆరేళ్లపాటు ఒకే క్యాడర్‌లో సర్వీస్ చేసిన వారికి స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఉద్యోగుల సమస్యలపై 15 రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. లేనిపక్షంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తరపున ఉద్యోగుల నియమ నిబంధనలకు కట్టుబడి రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కొల్లి రాజేష్, సంజయ్ డేవిడ్, దుర్గాప్రసాద్, నూకరాజు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

యువతకు వివేకానందుడు స్ఫూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ ఆర్ఐఓ నరసింహం



వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేస్తున్న స్వామి పరిజ్ఞేయానందజీ తదితరులు

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ సొసైటీ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో చికాగో నగరంలో విశ్వమత మహాసభలో వివేకానందుని చారిత్రాత్మక ఉపన్యాసంపై సభ నిర్వహించారు. దీనికి కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్‌బోర్డు ఆర్ఐఓ ఎన్ఎస్‌వీఎల్ నరసింహం, వివేకానంద కేంద్ర కార్యదర్శి ఎన్ఆర్ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు. స్వామి వివేకానంద సనాతన హిందూ మతానికి ప్రతినిధి అని, సర్వమత మహాసభలో పాల్గొని అసంఖ్యాకులు అయిన ప్రజలను ప్రభావితం చేశారన్నారు. చికాగో సర్వమత సభలో వివేకనంద పాల్గొని నేటికీ 130 ఏళ్లు పూరయ్యిందన్నారు. వివేకానంద కేంద్ర ప్రతినిధి కె.ప్రభాకర్‌రావు, ఇన్‌చార్జ్ పి.త్రినాథ్‌రాజా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు మంజువేని, ఎం.వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద ఉపన్యాసం చారిత్రాత్మకం

సీటీఆర్ఐ: స్వామీ వివేకానంద 1893వ సంవత్సరం సెప్టెంబర్ 11న చికాగో నగరంలో విశ్వమత మహాసభలో చేసిన చారిత్రాత్మక ఉపన్యాసం భారతీయుల ఘనతను చాటిందని స్వామి పరిజ్ఞేయానందజీ అన్నారు. గురువారం స్థానిక కంబాలచెరువు వద్ద స్వామీ వివేకానంద స్వామి వివేకానంద చికాగో నగర ఉపన్యాసాల 132వ వార్షికోత్సవం రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వివేకానంద విగ్రహానికి పుష్పాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కేఆర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవకుమారి, స్వామి సేవ్యానందజీ, లోకమయానందజీ తదితరులు పాల్గొన్నారు.

సర్వేల నుంచి విముక్తి కల్పించండి



ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

రాజమహేంద్రవరం రూరల్: ఇంటింటా సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కల్పించాలని రూరల్ ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్‌ను గ్రామ సచివాలయ ఉద్యోగులు కోరారు. గురువారం మండలంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో హుకుంపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓకు సచివాలయ ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులంతా ప్రతిసారి ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్ర స్థాయిలో తీవ్ర అవమానాలకు గురవుతున్నామన్నారు. తద్వారా ఉద్యోగుల ఆత్మ గౌరవానికి భంగం కలుగుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని అభ్యర్థిస్తున్నామన్నారు. సమయ పాలన లేని ఒత్తిడితో కూడిన విధుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యాలయ పనివేళలు పాటించకుండా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడం, సెలవులు, పండగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయించడం సరికాదన్నారు. అలాగే నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని కోరారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఐక్యవేదిక పిలుపు మేరకు ఆందోళనలు ఉధృతం చేస్తామని ఉద్యోగులు తెలిపారు.

వాడవాడలా అన్నసమారాధనలు



చైతన్యనగర్‌లో అన్న ప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాలకృష్ణ

కడియం: వినాయక నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు గురువారం జరిగాయి. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్‌లో ఏర్పాటైన అన్నసమారాధనలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హాజరయ్యారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, నాయకుడు రాజా హరిశ్చంద్ర తదితరులు ఉన్నారు. కడియంలో శ్రీలక్ష్మీగణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా దాతలు, భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. కడియపుసావరం వైఎస్సార్ కాలనీలో అన్న ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.

పీహెచ్‌సీ అభివృద్ధికి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తదితరులు

కడియం: కడియపులంకలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి కృషి చేస్తామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆసుపత్రి భవనంలో గురువారం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. శాశ్వత భవన నిర్మాణంతో పాటు, ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటుకు సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. అనంతరం పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వైద్యాధికారి ఎస్.జెస్సీ సుప్రియ, ఎంపీడీఓ కె.రమేష్, తహసీల్దార్ సునీల్‌కుమార్, సర్పంచ్ ఎం.పద్మావతి, దామిరెడ్డిపల్లి సర్పంచ్ ముద్రగడ సత్యస్వరూపలతో కూడిన ఈ కమిటీ సమావేశంలో డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య, పి.మురళీకృష్ణ, కడియం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చిరుకూరి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక గౌతమి గ్రంథాలయంలో గురువారం భారత్ వికాస్ పరిషత్ మూడు శాఖలు సంయుక్తంగా భారత కో జానో క్విజ్ పోటీలు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. జూనియర్ విభాగంలో రవీంద్ర విద్యానికేతన్, లోరియల్ గ్లోబల్ స్కూల్, శ్రీసద్గురు విద్యానికేతన్ విజయం సాధించి, రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. సీనియర్స్ విభాగంలో తిలక్ రోడ్డు అక్షరశ్రీ, శ్రీసద్గురు విద్యానికేతన్, శ్రీఎస్‌కేఆర్ వుమెన్స్ కాలేజీ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతరం గ్రంథాలయ లైబ్రేరియన్ శ్రీదేవి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పీవీఎస్ నారాయణ, రాష్ట్ర కోశాధికారి తాడోజు సాయికృష్ణ, సౌత్ రీజనల్ టీమ్ జనరల్ సెక్రటరీ డి.పురుషోత్తమ శాస్త్రి, జిల్లా కోఆర్డినేటర్ కేవీవీఎస్ అవధాని, క్విజ్ మాస్టర్‌గా స్వామినాథన్ పాల్గొన్నారు.

ఆధునిక పరిశోధనలపై అవగాహన



శాస్త్ర ప్రదర్శనలో పాల్గొన్న ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో దేశ సేవలో అణువులు అనే అంశంపై జరిగిన ఐదు రోజుల శాస్త్ర ప్రదర్శనలో స్థానిక ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే గురువారం తెలిపారు. దేశంలోని ప్రముఖ అణు పరిశోధనా కేంద్రాల్లో ఒకటైన తమిళనాడు కల్పాక్కంలోని ఇందిరా గాంధీ అణు పరిశోధనా కేంద్రం భాగస్వామ్యంతో జరిగిన ప్రదర్శనలో విద్యార్థులు వివిధ శాస్త్రీయ ప్రదర్శన స్టాల్స్ సందర్శించి, ఆధునిక పరిశోధనలు, ప్రయోగాలు వీక్షించారన్నారు. అణుశాస్త్రంపై ప్రముఖ శాస్త్రవేత్తలు అందించిన ప్రత్యేక ప్రసంగాలు, అణుశాస్త్రం ప్రాథమిక సూత్రాలు, దేశాభివృద్ధిలో అణుశక్తి ప్రాధాన్యం వంటి విషయాలపై అవగాహన పొందారన్నారు. ఈ సందర్శనలో ఫిజిక్స్ విభాగం అధ్యాపకులు డాక్టర్. యుసబ్ బాషాషేక్, బి.దుర్గాలక్ష్మి, కె.వెంకటేశ్వరరావు, బి.గౌరీనాయుడు, కె.సురేష్, బి.లక్ష్మణరావు, జె.నిరంజనరావు పాల్గొన్నారు.

భోజన పథకం అమలు పరిశీలన



విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న వెంకట్రాజు

కంబాలచెరువు: స్థానిక ఆంధ్రనగర్‌లోని పవర్స్ ఎయిడెడ్ యూపీ స్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రాజు గురువారం సందర్శించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు. పాఠశాల హెచ్ఎం వి.పద్మజ పాఠశాల నిర్వహణలో తీసుకుంటున్న శ్రద్ధను, అధిక శాతం విద్యార్థులు మధ్యాహ్న బడి భోజనం చేయడాన్ని అభినందించారు. రికార్డులు పరిశీలించారు. డీఈఓ కార్యాలయ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కంబాలచెరువు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి అన్నారు. డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో స్థానిక ఆనంద్‌నగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలతో అనర్థాలు, ట్రాఫిక్ నియమాలు, మాదక ద్రవ్యాల వినియోగంతో నష్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పేదలకు ఉచిత న్యాయ సాయం అందించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమన్నారు. పాఠశాల హెచ్ఎం ఎ.మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు మణికుమారి, లోవబాబు, దుర్గాభవాని, వేణుమాధవ్, శ్రీవల్లి, పారా వలంటీర్ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల వితరణ

రాజానగరం: మండలంలోని లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, బిస్కెట్లు, చిక్కీలతో పాటు స్టీల్ ప్లేట్లను మానవతా స్వచ్ఛంద సంస్థ వితరణగా గురువారం అందజేసింది. డొక్కా సీతమ్మ పేరిట ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులు భోజనాలు చేసేందుకు వీటిని వినియోగించాలన్నారు. హెచ్ఎం రమేష్, సంస్థ ప్రతినిధులు బి.మురళీ, మధు, గాంధీ, రుద్రమదేవి, టి.రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీకి రైతులకు టోకెన్లు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా కోసం రైతులకు టోకెన్లు జారీ చేస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. గురువారం రాజవోలు సొసైటీ ఆవరణలో యూరియా అవుట్ రీచ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవసరానికి మించి యూరియా వాడడంతో నేల సహజ స్వభావం కోల్పోతుందన్నారు. 45 కిలోల యూరియా బస్తాను అర లీటరు నానో యూరియా సమర్థవంతంగా భర్తీ చేస్తుందన్నారు. యూరియాకు బదులుగా సహజంగా దొరికే ఆవు పేడ, ఆవు మూత్రంతో ద్రవ ఘన జీవామృతం వినియోగించి పలు పంటలు పండించుకోవచ్చన్నారు. రాజమహేంద్రవరం ఏడీఏ శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వల్లూరి చెంచు రాజు, సీఈఓ జితేంద్ర, మాజీ సర్పంచులు నిమ్మలపూడి రామకృష్ణ, వాకలపూడి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్, ఏఈఓ పీటర్, వీఏఏ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఎకానమీ బౌలర్‌గా భార్గవిలక్ష్మి

ప్రకాశంనగర్: ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన ఆంధ్ర ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో రాజమహేంద్రి కళాశాల విద్యార్థిని సున్నం భార్గవిలక్ష్మి బెస్ట్ ఎకానమీ బౌలర్‌గా నిలిచిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రసాద్ గురువారం తెలిపారు. భార్గవిలక్ష్మి ఆరు మ్యాచ్‌లో 22 ఓవర్లు చేసి 117 పరుగులు మాత్రమే ఇచ్చి, 9 వికెట్లు తీసిందన్నారు. టోర్నమెంట్‌లో బెస్ట్ ఎకానమీ బౌలర్ సీరిస్‌తో పాటు రూ.40 వేల బహుమతి గెలుచుకుందన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి



ఖాదర్ బాషాకు స్వాగతం పలికిన ముస్లింలు

రాజమహేంద్రవరం సిటీ: మైనార్టీ సోదరులంతా వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని స్టేట్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జనాబ్ ఖాదర్ బాషా పిలుపునిచ్చారు. గురువారం నగరానికి విచ్చేసిన ఆయనకు నగర మైనార్టీ విభాగం స్వాగతం పలికింది. కార్యక్రమంలో స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ హుస్సేన్, మైనార్టీ అధికార ప్రతినిధి మీర్జా మౌలాలి, సిటీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ అరి పుల్లాఖాన్, మాజీ జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఎండీ ఆరిఫ్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి వేణు పరామర్శ



పోసికుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ గురువారం పరామర్శించారు. ఇటీవల పోసికుమార్ మావయ్య వంగా వీరభద్రరావు మృతి చెందారు. ఈ సందర్భంగా పోసికుమార్ కుటుంబ సభ్యులను వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. ఇటీవల ముత్యాలమ్మ ఆలయ ఉత్సవ నిర్వాహకుడు మెండా సీతారామయ్య మృతి చెందగా ఆ కుటుంబాన్ని వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. మెండా సీతారామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట వేమగిరి సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ వెలుగుబంటి అచ్యుతరామ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల తిరుపతిరావు (అను), వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యనుముల త్యాగరాజు, రూరల్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కోటిపల్లి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల :	కిష్కింధపురి
సూర్యమినీ :	ది కంజూరింగ్ , ఘాటీ
సూర్యప్యాలెస్ :	డిమోన్ స్లేయర్
స్వామి :	మిరాయ్
అనుశ్రీ :	మిరాయ్
శివజ్యోతి :	కిష్కింధపురి
రాజా :	మిరాయ్
ఊర్వశి :	లిటిల్‌హార్ట్స్, మహావతార్ నరసింహ
మేనక :	కిష్కింధపురి
రంభ :	మిరాయ్
అప్సర :	కొత్తలోక
అశోక :	మదరాసి, డిమోన్ స్లేయర్,
నామవరం	
వీఎస్ మహల్ :	మిరాయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ :	మిరాయ్
కడియం	
వెంకటసూర్య :	మిరాయ్